# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 10-02-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **విద్యార్థులలో పరీక్షల ఒత్తిడిని తగ్గించేదుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ వారితో సంభాషించే 'పరీక్షా పే చర్చ' కార్యక్రమం ఈ రోజు జరగనుంది.**
2. **తెలంగాణను మూడు జోన్లుగా అభివృద్ధి చేస్తున్నామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తెలిపారు.**
3. **ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరులో విమానాశ్రయం ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి డాక్టర్ పి. నారాయణ పేర్కొన్నారు.**
4. **ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.**
5. **ఈరోజు జాతీయ నులిపురుగుల నివారణదినాన్ని నిర్వహిస్తున్నారు.**

==========================

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈరోజు ప్రయాగ్ రాజ్‌లో కుంభమేళాలో పర్యటిస్తారు. పర్యటనలో భాగంగా త్రివేణీ సంగమంలో పుణ్యస్నానం, ప్రార్థనలు చేస్తారు. అనంతరం బడే హనుమాన్ ఆలయం, పవిత్ర అక్షయవత్ వృక్షాన్ని సందర్శిస్తారు. కుంభమేళా ప్రదేశంలో ఏర్పాటు చేసిన 'డిజిటల్ కుంభ్ అనుభవ్ సెంటర్'ను పరిశీలిస్తారని రాష్ట్రపతి భవన్ వర్గాలు వెల్లడించాయి. ద్రౌపదీ ముర్ము పర్యటన సమయంలో ఆమె వెంట ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఉంటారని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో కుంభమేళాలో అధికారులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు.

--------------------------

విద్యార్థులలో పరీక్షల ఒత్తిడిని తగ్గించేదుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ వారితో సంభాషించే 'పరీక్షా పే చర్చ' 8వ సంచిక కార్యక్రమం ఈరోజు జరగనుంది. ఢిల్లీలోని భారత మండపంలో జరగనున్న ఈ కార్యక్రమంలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుండి వివిధ పాఠశాలలకు చెందిన 36 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లోని భయాన్ని తొలగించి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపే ప్రయత్నాన్ని ప్రధానమంత్రి చేస్తున్నారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను మిళితం చేస్తూ.. 'పరీక్షా పే చర్చ' నిర్వహిస్తున్నారు. ఈ రోజు ఉదయం 11 గంటలకు ప్రారంభమైయ్యే .. పరీక్షా పే చర్చ కార్యక్రమాన్ని ఆకాశవాణి, దూరదర్శన్, స్వయం ప్రభ, పిఎమ్ఓ యూట్యూబ్ ఛానల్, విద్య, సమాచార ప్రసార మంత్రిత్వ శాఖల సామాజిక ప్రసార మాధ్యమాలలో ప్రత్యక్ష ప్రసారం చేస్తాయి.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరులో విమానాశ్రయం ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరులో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో మంత్రి నిన్న పాల్గొన్నారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, విమానాశ్రయం కోసం 700 ఎకరాల భూమిని సమీకరించామన్నారు. విమానాశ్రయ ఏర్పాటుకు సంబంధించి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో చర్చించామని.. త్వరలోనే కేంద్రం నుంచి ఒక ప్రత్యేక బృందం నెల్లూరుకు వస్తుందని మంత్రి తెలుపుతూ,

వాయిస్ .. 30 సెకన్లు

---------------------------

తెలంగాణను మూడు జోన్లుగా అభివృద్ధి చేస్తున్నామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తెలిపారు. కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురంలో నిర్వహించిన మాతృభూమి ఇంటర్నేషనల్ ఫెస్టివల్‌లో నిన్న ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు గ్రీన్ ఎనర్జీ పాలసీ తీసుకొచ్చామని, మూడు వేల విద్యుత్ బస్సులను కొనుగోలు చేశామని చెప్పారు. 14 నెలల వ్యవధిలో 1.82 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని అన్నారు. తలసరి ఆదాయం ఎక్కువగా ఉన్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని ముఖ్యమంత్రి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా సమగ్రాభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. ఒంగోలులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రకాశం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో మంత్రులు నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై సమావేశంలో చర్చించారు. అనంతరం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాత్రికేయులతో మాట్లాడుతూ,

..వాయిస్.. 30 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో బీసీల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఆ శాఖ మంత్రి ఎస్. సవిత అన్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలను ఆమె నిన్న ప్రారంభించారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... వెనుకబడిన వర్గాలకు స్వయం ఉపాధి కల్పించే విధంగా ప్రణాళికను అమలు చేస్తున్నామన్నారు. లక్ష మంది మహిళలకు టైలరింగ్ లో శిక్షణ ఇచ్చి కుట్టు మిషన్లను అందిస్తామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని మంత్రి పేర్కొంటూ

వాయిస్ .. 21 సెకన్లు

---------------------------

వైద్యరంగంలో వస్తున్న మార్పుల నేపథ్యంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఎముకలు, కీళ్ల సంబంధిత సమస్యలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్లో నిర్వహించిన ఆర్థోపెడిక్ వాక్ థాన్‌ను మంత్రి

నిన్న ప్రారంభించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ఆర్థోపెడిక్ సమస్యలపై అవగాహన అవసరమని అన్నారు. ప్రతి ఒక్కరూ శారీరక ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని మంత్రి సూచిస్తూ

వాయిస్ ..30 సెకన్లు

---

'జాతీయ నులిపురుగుల నివారణదినాన్ని' ఈరోజు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఒకటి నుండి 19 సంవత్సరాల వయసుగల పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు అందిస్తున్నారు. పిల్లల్లో నులిపురుగుల సమస్య నివారించే లక్ష్యంతో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వైద్య ఆరోగ్య శాఖలు ఈ సందర్భంగా అవగాహన కార్యక్రమాలు మాత్రల పంపిణీ కోసం అన్ని ఏర్పాట్లు చేశాయి.

---

ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాకు చెందిన నంగి భూమిక అనే వైద్యురాలు రహదారి ప్రమాదంలో బ్రెయిన్ డెడ్‌కు గురైయ్యారు. ప్రస్తుతం హైదరాబాదులోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యురాలిగా సేవలు అందిస్తున్న ఆమె తెలంగాణా లోని ఖానాపూర్ వద్ద ఫిబ్రవరి ఒకటవ తేదీన జరిగిన రహదారి ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఈ క్రమంలో భూమిక బ్రెయిన్ డెడ్ కు గురైనట్టు వైద్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆమె కుటుంబ సభ్యులు అవయదానానికి ముందుకు వచ్చారు. డాక్టర్ భూమిక కాలేయం, రెండు మూత్రపిండాలు, గుండె, ఊపిరితిత్తులు దానం చేశారని తెలంగాణా జీవన్ దాన్ నిన్న ఒక ప్రకటనలో తెలిపింది. అవయవాలను దానం చేయడానికి ముందుకు వచ్చిన డాక్టర్ భూమిక కుటుంబ సభ్యులను పలువురు అభినందిస్తున్నారు. తెలంగాణా ఆర్.టి.సి. మేనేజింగ్ డైరెక్టర్ వి.సి. సజ్జనార్ డాక్టర్ భూమిక కుటుంబ సభ్యులను అభినందించారు. అవయవ దానం చేయడానికి ముందుకు వచ్చిన భూమిక కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలుపుతున్నామని సామాజిక మాధ్యమం ఎక్స్ లో పేర్కొన్నారు.

---

ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా శ్రీశైలంలో ఈరోజు రాష్ట్ర మంత్రుల బృందం పర్యటించనుంది. పర్యటనలో భాగంగా శ్రీశైలం దేవస్థానంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. అలాగే ఈనెల 23వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన ఏర్పాట్లు, భక్తుల సౌకర్యాలపై మంత్రుల సమీక్ష నిర్వహిస్తారని అధికారులు తెలిపారు. ఈ పర్యటనలో రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, ఆనం రామనారాయణరెడ్డి, అనగాని సత్య ప్రసాద్, వి.అనిత, బీసీ జనార్దన్ రెడ్డి పాల్గొంటారని అధికారులు తెలిపారు

---

శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోని కావలి పట్టణం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని స్థానిక శాసన సభ్యులు డి. వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. జిల్లాలోని కావలి ప్రాథమిక వైద్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్‌తో కలిసి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ, జిల్లాలోని రామాయపట్నం పోర్టు, ఫిషింగ్ హార్బర్లను అనుసంధానించి పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇప్పటికే బిపిసిఎల్ రిఫైనరీ, ఇండోసోల్ సౌరశక్తి కేంద్రం ఏర్పాటు కానున్నాయని.. వీటి ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగనున్నాయన్నారు.

====================